ఎస్టీపీ నిర్మాణానికి స్థలం ఎంపిక





సాక్షి,సిటీబ్యూరో: అమృత్‌ పథకంలో భాగంగా నిర్మించే 39 ఎస్టీపీల్లో తెల్లాపూర్‌లో (31 ఎమ్మెల్డీల సామర్థ్యం)తో తలపెట్టిన ఎస్టీపీ కోసం స్థలం ఎంపికైంది. శనివారం జలమండలి ఎండీ అశోక్‌ రెడ్డి తెల్లాపూర్‌లోని మేళ్ల, వనం చెరువుల పరీవాహక ప్రాంతాలను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించి వనం చెరువు దగ్గర ఎస్టీపీ నిర్మాణానికి సరిపడా స్థలాన్ని ఎంపిక చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలతో చర్చించి.. ఎస్టీపీ నిర్మాణం వల్ల జరిగే లాభాలను వివరించారు. దీనివల్ల మురుగు నీటిని శుద్ధి చేయడమే కాకుండా చెరువు కలుషితం కాకుండా ఉంటుందని తెలిపారు. దీంతో వారు సూత్రప్రాయంగా అంగీకరించి, ఎస్టీపీ నిర్మాణానికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

నల్లగండ్ల ఎస్టీపీ సందర్శన..

అనంతరం నల్లగండ్లలో నిర్మిస్తున్న 7 ఎమ్మెల్డీ సామర్థ్యం గల ఎస్టీపీని ఎండీ అశోక్‌ రెడ్డి సందర్శించారు. పనులు చివరి దశలో ఉన్న ఈ ఎస్టీపీలో మెకానికల్‌, ఎలక్ట్రికల్‌ పనులు ఏకకాలంలో చేపట్టి.. నవంబర్‌ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే వెట్‌ వెల్‌, ఎస్బీఆర్‌, బ్లోయర్‌ రూమ్‌ వద్ద పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీజీఎం పద్మజ, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి



రిజిష్టర్లను ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు

శేరిలింగంపల్లి: రోగుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శేరిలింగంపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో ఆశ కార్యకర్తల రిజిష్టర్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైలీ డైరీతో పాటు 17 రకాల రిజిష్టర్లలో రోగుల వివరాలను నమోదు చేయడం వల్ల నవ జాత శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందించడంతో పాటు గర్భిణులకు మెరుగైన వైద్యం అందించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీహెచ్‌ డిస్ట్రిక్ట్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ పూనమ్‌, డీపీహెచ్‌ఎంవో విజయలక్ష్మి, సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్‌ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించండి



జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్‌ పుష్పనగేశ్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డిను శనివారం కార్పొరేటర్‌ పుష్ప మర్యాదపూర్వకంగా కలసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు విద్యుత్‌ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నూతన సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందుకు కావాల్సిన స్థలాన్ని కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. అలాగే, విద్యుత్‌ దీపాలు, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు.

విద్యార్థులకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌

కూకట్‌పల్లి: నేషన్స్‌ బెనిఫిట్స్‌ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ సీఎస్‌ఆర్‌ యాక్టివిటీలో భాగంగా రాందేవ్‌రావ్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో 9 నుంచి 15 సంవత్సరాల లోపు ఉన్న 80 విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ 2 డోసులను శనివారం ఉచితంగా అందజేశారు. రిక్షాపుల్లర్స్‌ కాలనీ జడ్పీహెచ్‌ఎస్‌ స్కూల్‌ జగద్గిరిగుట్ట విద్యార్థినులకు ఈ వ్యాక్సిన్‌ అందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సెక్రటరీ జె మీరారావు, అపర్ణ పాల్గొన్నారు. ఉచిత వ్యాక్సినేషన్‌కు ఆర్థికంగా సహకారం అందించిన నేషన్స్‌ బెనిఫిట్స్‌ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ వైస్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌, పత్తికొండ, టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ కమలాకర్‌, హెచ్‌ఎం కిషన్‌, సీఈఓ యోబు, మేరి డేవిడ్‌, కల్పన, రమాదేవి, లలిత, శ్రావణ్‌రెడ్డి, రవీందర్‌, రామ్‌ కళ్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో సూర్య నమస్కారాల పోటీ

కేపీహెచ్‌బీకాలనీ: మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో శనివారం జేఎన్‌టీయూలో 108 సూర్య నమస్కారాల పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు హైదరాబాద్‌ నుంచి ప్రభుత్వ పాఠశాలల ఎన్‌ఎస్‌ఎస్‌, ఎన్‌సీసీ విద్యార్థులు, యోగా టీచర్లు, మియాపూర్‌, మాదాపూర్‌, జనగాం విద్యార్థులు, యోగా టీచర్లు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు. విశ్వ మానవతా సంస్థ అధ్యక్షులు శ్రీనివాస చౌదరి జన్మదినం సందర్భంగా ఆయన పిలుపు మేరకు వివిధ పాఠశాలల్లో వ్యక్తిత్వం అంటే ఏమిటి?, నీవు వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకోవాలనుకుంటున్నావు అనే అంశంపై వివిధ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ యోగ సాధకులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా నిమ్స్‌ వైద్యుల బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది రక్తాన్ని దానం చేశారు. పాల్గొన్న వారికి మొక్కలను అందజేశారు.



పనులపై పట్టింపేదీ..?

- పగుళ్లు ఏర్పడి మున్నాళ్ల ముచ్చటగానే మిగిలుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

సీసీ రోడ్డు నిర్మాణాలకు తూతూ..మంత్రంగా క్యూరింగ్‌



దీప్తిశ్రీనగర్‌ కాలనీలో క్యూరింగ్‌కు నోచుకోని సీసీ రోడ్డు

మియాపూర్‌: ప్రజా అవసరాల దృష్ట్యా లక్షలాది రూపాయాలతో పలుచోట్ల నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉంటున్నాయి. పనులు ప్రారంభం మొదలు అందుబాటులోకి వచ్చేవరకు పర్యవేక్షించాల్సిన జీహెచ్‌ఎంసీ క్వాలిటీ కంట్రోల్‌ అధికారుల ఉదాసీనతా, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఫలితంగా పనుల్లో నాణ్యత కొరవడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తూతూ.. మంత్రంగా క్యూరింగ్‌ చేసి వదిలేయడంతో పగుళ్లు ఏర్పడి మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్‌ శాఖలో కొంతమంది అధికారులు కాసుల కక్కుర్తితో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతంతమాత్రంగానే క్యూరింగ్‌..

సీసీ రోడ్డు పనులు చేపట్టి ఉదయం, సాయంత్రం వేళల్లో రోజుకు రెండుసార్లు క్యూరింగ్‌ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు కాంట్రాక్టర్లు పైపైనే క్యూరింగ్‌ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేగాకుండా రోడ్డు నిర్మాణం సమయంలో నిర్ణీతదూరంలో మ్యాగ్నటిక్‌ రబ్బర్‌ తాళ్లను ఏర్పాటు చేసి పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ అవేమీ వేయకుండానే రోడ్డును వేస్తుండడంతో త్వరగానే పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

- మియాపూర్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన సీసీ, బీటీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్ది రోజులకే పగుళ్లుపడి గుంతలు ఏర్పడుతున్నాయి.
- నాణ్యతా ప్రమాణాలు చూడాల్సిన క్వాలిటీ కంట్రోల్‌ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతోనే రోడ్ల పరిస్థితి ఇలా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- అధికారులు రోడ్ల పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు సరిగా లేకుంటే నోటీసులు ఇచ్చి బిల్లులు ఆపే అధికారం ఉన్న ఆచరణలో లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ, సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఎంఏనగర్‌ నుంచి శాంతినగర్‌ వెళ్లే సీసీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు



దీప్తిశ్రీనగర్‌ కాలనీలో గుంతలమయంగా రోడ్డు

ఆర్ట్‌గ్యాలరీలో మైఓన్‌ ట్రబుల్డ్‌ వరల్డ్‌ చిత్రప్రదర్శన





చిత్రప్రదర్శనను తిలకిస్తున్న రమణారెడ్డి తదితరులు, ఆకట్టుకుంటున్న చిత్రం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో మై ఓన్‌ ట్రబుల్డ్‌ వరల్డ్‌ పేరిట శనివారం నిర్వహించిన చిత్రప్రదర్శనను హైదరాబాద్‌ ఆర్ట్‌ సొసైటీ అధ్యక్షుడు ఎంఈ రమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ప్రదర్శనలో పేయింటింగ్స్‌, స్కల్పర్స్‌ అందుబాటులో ఉంచారు. దాదాపు 100కి పైగా వర్క్‌లను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈనెల 28 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యార్చన

మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం యాప్రాల్‌ నుంచి శ్రీనృపుర డ్యాన్స్‌ అకాడమీ గురువు సరిత ప్రవీణ శిష్య బృందం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో గణేశ శరణం, పుష్పాంజలి, ముద్దుగారే యశోద, అష్టలక్ష్మి, శ్రీమన్నారాయణ, చిన్నకన్నన్‌, అదివో అల్లదివో తదితర అంశాలను ప్రదర్శించారు. సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ నందకుమార్‌ కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.



కన్నుల పండువగా ప్రవాస నర్తకి 'విశిష్ట' నృత్యార్పణం



నృత్యాన్ని వీక్షిస్తున్న చిన్నజియర్‌స్వామి



రాయదుర్గం: ప్రవాస నర్తకి విశిష్ట డింగరి సమర్పించిన భరత నాట్య నృత్యార్పణం నేత్రపర్వంగా సాగింది. ముంబాయికి చెందిన నృత్యోదయ పర్ఫార్మింగ్‌ ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌ ప్రాంగణంలోని గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో అమెరికా నుంచి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన విశిష్ట డింగరి భరత నాట్య సోలో ప్రదర్శన నిర్వహించారు. శనివారం రాత్రి ఈ కార్యక్రమాన్ని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జియర్‌స్వామి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉద్యోగం చేసుకుంటూ సాంప్రదాయాన్ని మరిచిపోకుండా భారతీయ నాట్య సేవ చేయడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ముంబాయికి చెందిన ప్రముఖ నాట్యగురువు డాక్టర్‌ జయశ్రీ రాజగోపాలన్‌ శిష్యురాలు అయిన విశిష్ట సాంప్రదాయ నృత్యాంజలితో తన ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురు పద్మవిభూషణ్‌ డాక్టర్‌ పద్మాసుబ్రహ్మణ్యం, కళారత్న అశోక్‌గుర్జాలే పాల్గొన్నారు.

పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లోని డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ కుల్దీప్‌ నారాయణ్‌ శనివారం పరిశీలించారు. సౌకర్యాలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పిల్లలను ఇంటి పనులకు దూరంగా ఉంచి నిత్యం పాఠశాలకు పంపాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యను బోధించాలని, వంద శాతం ఉత్తీర్ణత పొందేల కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనను ఘనంగా సన్మానించారు.

అభివృద్ధికి నిరంతర కృషి

జిన్నారం (పటన్‌ చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కొలన్‌ రోజా శనివారం శంకుస్థాపన చేశారు. 7, 8వ వార్డుల్లో రూ.50 లక్షల మున్సిపల్‌ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దశలవారీగా మున్సిపాలిటీ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ సతీష్‌, ఏఈ కిష్టయ్య, స్థానికులు నబీ, శ్రీను, గణపతి, కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.

మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడిగా ప్రభాకర్‌ రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అనంతరం బీఆర్‌ఎస్‌ శ్రేణులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్‌: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌ అన్నారు. శనివారం డివిజన్‌ పరిధిలోని కోదండ సీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు.

పీసీబీ అధికారుల తీరుపై ఆగ్రహం

జిన్నారం (పటన్‌ చెరు): జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లీ ఫార్మా పరిశ్రమపై పీసీబీ అధికారుల తీరు విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 28న పీసీబీ రాష్ట్ర కార్యాలయంతో పాటు రామచంద్రపురంలోని రీజినల్‌ కార్యాలయంలో గ్రామస్తులు లీ ఫార్మా పరిశ్రమపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కాని, ఎలాంటి చర్యలు తీసుకోలేని మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్‌ జహంగీర్‌, కీర్తిగుప్తా, ప్రిన్సిపాల్‌ రవి తదితరులు

రాయదుర్గం: విద్యతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటే అవకాశాలు మెండుగా ఉంటాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం హెడ్‌ ప్రొఫెసర్‌ వై. జహంగీర్‌ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లిలోని సెయింట్‌ జేవీయర్స్‌ పీజీ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'ఎంబీఏ ఫ్రెషర్స్‌–నెక్స్ట్‌–జెన్‌–మేనేజర్స్‌' అనే అంశంపై శనివారం నిర్వహించిన ఓరియంటేషన్‌ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో టెక్నాలజీలో అనేక మార్పులు వస్తాయని, అందులో ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌తో వచ్చే ఉపయోగాలు, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా ఆలోచించాలన్నారు. చదువు, ఇతర పనులపై ఒక ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. హైదరాబాద్‌ కాస్ట్‌ మేనేజ్‌మెంట్‌ అకౌంటెంట్‌ కోశాధికారి కీర్తి గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత కార్పొరేట్‌ ప్రపంచంలో కేవలం చదువుంటే సరిపోదని, అవసరానికి అనుగుణంగా నైపుణ్యాలు కూడా నేర్చుకోవాలని, సర్టిఫికెట్‌ కోర్సులపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ టీ రవి మాట్లాడుతూ యేటా మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్‌ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రమశిక్షణ, కష్టపడేతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకునేలా, వారిలో నైపుణ్యాలు మెరుగుపడేలా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సుధీర్‌, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్‌ డీ శ్రీలత, కే శ్వేత, కే భారతి, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కళాఉత్సవ్‌ పోటీలు



బహుమతి అందుకుంటున్న రాయదుర్గం జడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థిని సాలీహతాజీన్‌



బహుమతి అందుకుంటున్న విద్యార్థి విక్రమ్‌

రాయదుర్గం: రామన్నగూడెంలోని వశిష్ట మోడల్‌ హైస్కూల్‌లో జిల్లాస్థాయి కళాఉత్సవ్‌ పోటీలను శనివారం నిర్వహించారు. డ్యాన్స్‌, ఇన్‌స్ట్రుమెంటల్‌ మ్యూజిక్‌, ఓకల్‌ మ్యూజిక్‌, డ్రామా, స్టోరీ టెల్లింగ్‌, విజువల్‌ ఆర్ట్స్‌ వంటి విభాగాల్లో మండలస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయదుర్గం స్కూల్‌ కాంప్లెక్స్‌ హెచ్‌ఎం ఎస్‌కే తాజ్‌బాబు మాట్లాడుతూ రాయదుర్గం జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థి సాలీహతాజీన్‌ డ్రామా విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. అదే విధంగా విజువల్‌ ఆర్ట్స్‌ విభాగం జిల్లా స్థాయి పోటీల్లో అదే పాఠశాలకు చెందిన విక్రమ్‌ ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ఆయన, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు





కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం చిన్మయి నృత్యాలయ గురువు శ్రీదేవి ముంగర శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఇందులో మామవతు శ్రీ సరస్వతి, గిరిజాకల్యాణం, అమృత వర్షిణి, వారాహి, వాసవి కన్యకా, గురుఅష్టకం, అయిగిరినందిని తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు అనూష, హరిణి, సాయి నిత్య, శ్రావ్య, అన్వి, దీప్త, జాన్వీ తదితరులు పాల్గొన్నారు.

కారులో అకస్మాత్తుగా మంటలు



మియాపూర్‌: కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా మనోహరాబాద్‌ మండలం కుంచారం గ్రామానికి చెందిన దుర్గం అరుణ్‌ కుమార్‌ శనివారం తన వ్యాగనర్‌ (టీఎస్‌11ఈఎఫ్‌6350) కారులో స్నేహితుడితో కలిసి పని నిమిత్తం పటాన్‌చెరుకు వెళ్లి తిరిగి మియాపూర్‌ మీదుగా మేడ్చల్‌ వెళ్తున్నాడు. సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో మియాపూర్‌ మెట్రో స్టేషన్‌ కింద పిల్లర్‌ నంబర్‌ –626 దగ్గరకు రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అరుణ్‌ కుమార్‌ తన స్నేహితుడు అప్రమత్తమై బయటకు వచ్చేశారు. కొద్దిసేపట్లోనే కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేశారు. మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపక సామగ్రి ఇవ్వాలని కోరగా వారు స్పందించలేదని బాధితుడు అరుణ్‌ కుమార్‌ వాపోయారు. ట్రాఫిక్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కాలిపోయిన కారును రహదారిపై నుంచి తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు.

హెచ్‌సీయూలో 'క్లీనప్‌ డ్రైవ్‌'





హెచ్‌సీయూలో క్లీనప్‌డ్రైవ్‌ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీలో ఎన్‌ఎస్‌ఎస్‌ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో శనివారం 'క్లీనప్‌డ్రైవ్‌' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనిట్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బీ కృష్ణయ్య ఆధ్వర్యంలో వలంటీర్లు క్యాంపస్‌లోని స్కూల్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ సైన్సెస్‌ అండ్‌ టెక్నాలజీ ప్రాంగణంలో ఆ విభాగం డీన్‌ ప్రకాశ్‌ గౌతం, ఫ్యాకల్టీ, విద్యార్థులు కూడా వలంటీర్లతో కలిసి ప్లాస్టిక్‌ వ్యర్థాలు, ఎండు ఆకులు,కలుపు మొక్కలు చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే పరిసరాల్లో ఎండిన దుంగలను తొలగించి ట్రాక్టర్‌ ద్వారా డంప్‌యార్డ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బీ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూను క్లీన్‌ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఏడాది పొడవునా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో ఎన్‌ఎస్‌ఎస్‌, శానిటేషన్‌, హార్టికల్చర్‌ విభాగాలు సమష్టిగా చేసే కార్యక్రమంలో విద్యార్థులు కూడా భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ బీసింగ్‌, వలంటీర్లు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమం అనంతరం శుభ్రంగా కనిపిస్తున్న పరిసరాలు

రూపురేఖలు మార్చిన ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌

హెచ్‌సీయూ క్యాంపస్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో స్కూల్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ సైన్సెస్‌ అండ్‌ టెక్నాలజీ విభాగం ప్రాంగణంలో క్లీనప్‌ డ్రైవ్‌ తర్వాత ఆ ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. ఇంతకుముందు ఉన్న పెరిగిన గడ్డి, చిన్నచిన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో అక్కడి పరిసరాలు ప్రస్తుతం శుభ్రంగా కనిపిస్తున్నాయి.